## ఫెంగ్ షుయి



# బంగారు చేపలతో అక్వేరియం

బంగారానికి కులము, మతమూ లేదు. బంగారాన్ని ఇష్టపడని వారు ఎవ్వరూ ఉండరు. బంగారం లేకపోయినా, బంగారు రంగులో ఉన్నవాటిని కూడా చాలా మంది ఇష్టపడుతుంటారు. బంగారం మనకు శుభసూచకం. ఇంట్లో బంగారుచేప (గోల్డ్‌ఫిష్)లను ఉంచుకుంటే చాలామంచిది. వీటి వలన సంపద వృద్ధి చెందుతుంది. గాజు తొట్టెలో కానీ, గాజు బౌలులో కానీ వీటిని ఉంచుకోవచ్చు. ఎరుపు లేక బంగారు రంగులో ఉన్నవి ఎనిమిది, నల్ల రంగులో ఉన్నది ఒకటి మొత్తం తొమ్మిది 'గోల్డ్ ఫిష్' లను ఇంట్లో ఉంచుకోవాలి. అయితే వీటిని ఎక్కడ పడితే అక్కడ ఉంచకూడదు. పడకగదిలో, వంటగదిలో, స్నానాల గదిలో వీటిని ఉంచనే కూడదు. అక్వేరియాన్ని హాలులో ఉంచుకుంటే మంచిది. హాలులో కూడా తూర్పు దిశలోగాని, ఆగ్నేయ దిశలోగాని, ఉత్తరం వైపున గాని వీటిని ఏర్పాటు చేసుకోవచ్చు. వీధి గుమ్మానికి కుడివైపున గోల్డ్‌ఫిష్‌లుండే అక్వేరియం ఉంచరాదు. ఇలా ఉంచడం వలన గృహ యజమానికి పరస్త్రీలపైకి మనసు పోతుంది.

ఒక్కోసారి అక్వేరియంలో ఉండే గోల్డ్ ఫిష్‌లు చనిపోతుంటాయి. ఇలా చనిపోవడం వలన చాలామంది కంగారు పడుతుంటారు. తమకు చెడు జరుగుతుందేమో అని భయపడుతుంటారు. అలా భయపడాల్సిన పని లేదు. ఇంట్లో వ్యక్తులకు జరిగే కీడును గోల్డ్‌ఫిష్‌లు తాము స్వీకరించి మేలు చేస్తాయి. కీడును స్వీకరించడం వలన అవి చనిపోతాయి. అలా గోల్డ్‌ఫిష్ చనిపోయిందంటే దానిని తీసివేసి మరో చేపను అందులో వేయాలి. ఇంట్లో గోల్డ్‌ఫిష్‌లను అక్వేరియంలో పెంచుకోలేని వారు, నీలి రంగు డాల్ఫిన్‌లు పైకి ఎగురుతున్న చిత్రాన్ని ఏర్పాటు చేసుకున్నా శుభం చేకూరుతుంది. అయితే నిజం చేపలను ఇంట్లో ఉంచుకోవడమే ఉత్తమం.

*

వారం వారం 'ఫెంగ్ షుయి' మీకోసం

## 'సరసి'కత

వైశంపాయనుడు కాలేజీలో చదివే రోజుల్లో ఒక ఇంట్లో రూము అద్దెకు తీసుకుని వుండేవాడు. టౌనులో 'బ్రహ్మచారులకి ఇల్లు అద్దెకు ఇవ్వబడదు' అని బయట బోర్డులు పెట్టేసరికి బ్యాచిలర్సు అందరూ ఇళ్లు దొరక్క విలవిల్లాడిపోయే ఆ రోజుల్లో వైశంపాయనుడు బ్రతిమలాడి, కాళ్లావేళ్లాపడి మరీ రూము సంపాదించేడు.

ఆ రూము వోనరమ్మకి యాభయ్యేళ్ల వయసు గల ఇంటితో బాటు పాతికేళ్ల వయసు గల కూతురు కూడా వుంది. అందగత్తె అయిన తన కూతురు వంక వైశంపాయనుడు కన్నెత్తి చూడకుండా చూసేదామె. వోనర్సుకి, అతడికీ ఒకటే బాత్‌రూము. ఇంటివెనక కాస్తంత దూరంలో వున్న ఆ స్నానాలగదికి తలుపు వుంది కాని, గొళ్లెం లేదు. అంతవరకూ అద్దెవాళ్లెవరూ లేనందున గొళ్లెం వేయిం చాల్సిన అవసరం రాలేదు. వైశంపాయనుడికి రూమ్ అద్దెకిచ్చేక, వూడిపోయిన ఆ గొళ్లెం రింగుకి ఒక తాడు కట్టి, దాని రెండో కొసని లోపలి మేకుకు చుట్లు చుట్టి స్నానం చేసుకోవాలని వైశంపాయనుడికి చెప్పింది వోనరమ్మ.

ఓ రోజు హడావుడిగా వెళ్లి తలుపు తీసిన వైశంపాయనుడికి 'కెవ్వు' మన్న కేక వినబడి




తర్వాత, లోపలి దృశ్యం కనబడింది. వోనరమ్మ గారి అమ్మాయి స్నానం చేస్తోంది. ఆ పిల్ల గొళ్లెం తాడు కట్టుకోవడం అలవాటు లేక మరిచి పోయి నట్టుంది. వైశంపాయనుడు కూడా కంగారు పడి తలుపు మూసేశాడు. కూతురు పెట్టిన కేక వినబడిన తల్లి వంటింటి కిటికీలోంచి చూసింది. బాత్రూమ్ తలుపు మూసి బయటకు వస్తున్న వైశంపాయనుడు కనిపించాడామెకు. ఆమె ఇంట్లోంచి పరుగెట్టుకొచ్చేలోగా మరోసారి 'కెవ్వు'మంది కూతురు. వైశంపాయనుడు రెండోసారి బాత్‌రూమ్ తలుపువేసి, వెనక్కి వస్తూ కనిపించాడు. వొళ్లు రవరవ లాడి పోయింది వోనరమ్మకి. పొరబాటు జరిగిందని తల వొంచుకున్నాడు వైశంపాయనుడు. ''పొరబాటా? ఓహో! ఒకసారి పొరబాటుగా వెళ్లావు. మరి రెండోసారెందుకు వెళ్లావుటా? సిగ్గులేదూ?'' ఉరిమిందావిడ.

''తప్పుచేశాక 'సారీ' చెప్పడం నాకలవాటండి. అందుకే రెండోసారి వెళ్లి చెప్పొచ్చాను. క్షమాపణ చెప్పడానికి సిగ్గుపడనండి!'' అన్నాడు వైశంపాయనుడు గర్వంగా.

*